





తరమణిలో ప్రపంచ బ్యాంక్‌కు చెందిన గ్లోబల్ బిజినెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

ప్రపంచ బ్యాంక్‌తో సంబంధాలు పటిష్ఠం

- ఈబీసీల సొంతింటి కల నెరవేరుస్తా
- సీఎం స్టాలిన్ ప్రకటన

చెన్నై, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ప్రపంచ బ్యాంక్‌కు మధ్య ఐదు దశాబ్దాలకు పైగా పటిష్ఠమైన సంబంధాలున్నాయని, ఆ బ్యాంక్‌ను రుణాలిచ్చే సంస్థగా కాకుండా సామాజికాభివృద్ధికి తోడ్పడే సంస్థగానే తాము భావిస్తున్నామని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వారికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని నిర్ణయించామని ఆయన ప్రకటించారు. తరమణిలో మంగళవారం ప్రపంచ బ్యాంక్ ఏర్పాటు చేసిన గ్లోబల్ బిజినెస్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ... 1971లో డీఎంకే ప్రభుత్వ హయాంలోనే ప్రపంచ బ్యాంక్‌తో భాగస్వామ్యం ఏర్పడిందని, అప్పట్లో ఆరోగ్యం, విద్య, నగరాభివృద్ధి శాఖలలో ఆ బ్యాంక్ అండగా నిలిచిందని చెప్పారు. 2022లో ప్రపంచ బ్యాంక్ ఢిల్లీ బయట తొలి జోనల్ కార్యాలయాన్ని చెన్నై నగరంలోనే ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ఈ తొలి జోనల్ కార్యాలయం రాష్ట్రానికే కాకుండా దక్షిణాది రాష్ట్రాలకు తన ఆర్థికపరమైన సేవలను వ్యాప్తిజేసిందన్నారు. రాష్ట్రంలో తన నాయకత్వంలో డీఎంకే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా ప్రపంచ బ్యాంక్ అన్ని విధాలా పథకాల అమలుకు ఆర్థికపరమైన, హార్థికపరమైన చేయూతనిస్తూనే ఉందన్నారు. 'తోళి' వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల ఏర్పాటు, నగరాభివృద్ధి పథకాల అమలు, రహదారుల అభివృద్ధి, నీటి పారుదల తదితర పథకాల అమలుకు ఆ బ్యాంక్ నిధులిచ్చిందన్నారు.

త్వరలో 'వుయ్ సేఫ్' పథకం..

ప్రపంచ బ్యాంక్ సహకారంతో త్వరలో మహిళలకు భద్రత, ఉపాధి అవకాశాలు కల్పించేలా 'వుయ్ సేఫ్' (నాంగ నలమ్) పేరుతో ప్రత్యేక పథకాన్ని అమలు చేయనున్నామని స్టాలిన్ ప్రకటించారు. అందరికీ అన్ని సదుపాయాలు అనే లక్ష్యంతోనే తమ ప్రభుత్వ పాలన కొనసాగుతోందని చెప్పారు. రాష్ట్రంలో ఆర్థికంగా వెనుకబడిన తరగతులవారి (ఈబీసీల) సొంతింటి కలను నెరవేర్చడమే తన ప్రధాన కర్తవ్యమని, ఆ దిశగా త్వరలోనే చర్యలు ప్రారంభిస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు తమిళచ్చి తంగపాండ్యన్, డాక్టర్ కనిమొళి సోము, ఎమ్మెల్యే హసన్ మౌలానా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్ మురుగానందం, ప్రపంచ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ వెంగాయ్‌జాంగ్, ఆ బ్యాంక్ భారతీయ వ్యవహారాల డైరెక్టర్ అగస్టే టానో కోమే, చెన్నై జోన్ చైర్మన్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలమొచ్చేస్తోంది.. త్వరగా గూడు కట్టుకుందేనే..!



చెన్నై మెరీనాతీరంలోని ఓ చెట్టుకు గూళ్లు కడుతున్న గిజిగాళ్లు

ఆరుగురూ ఏకగ్రీవం?

- రేపు అధికారికంగా వెల్లడించనున్న ఎన్నికల అధికారి

ప్యారీస్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభలో రాష్ట్రానికి సంబంధించి ఖాళీ అవుతున్న ఆరు స్థానాలకు అధికార డీఎంకే, ప్రతిపక్ష అన్నాడీఎంకేల తరఫున నామినేషన్ వేసిన ఆరుగురు ఏకగ్రీవంగా ఎన్నికకానున్నారు. దీనికి సంబంధించి గురువారం అధికారికంగా ప్రకటన రానుంది. రాష్ట్రం తరుపున పెద్దల సభలో 18 మంది ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిలో ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి, వైగో, పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి, డీఎంకే న్యాయవిభాగానికి చెందిన పి.విల్సన్, షణ్ముగం, అబ్దుల్లా, అన్నాడీఎంకేకు చెందిన చంద్రశేఖరన్ పదవీకాలం జూలై 24వ తేదీతో ముగియనుంది. ఈ ఆరుస్థానాలు భర్తీచేసేందుకు ఈ నెల 19న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. రాష్ట్రం నుంచి ఒక రాజ్యసభ సభ్యుడిని ఎంపిక చేసేందుకు 34 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. డీఎంకే తరఫున సీనియర్ న్యాయవాది పి.విల్సన్‌కు మళ్ళీ అవకాశం రావడంతో ఆయనతో పాటు శివలింగం, సల్మా, ఎంఎన్‌ఎం అధ్యక్షుడు నటుడు కమల్‌హాసన్, అన్నాడీఎంకే తరుపున ఇన్బదురై, ధనపాల్ నామినేషన్ వేశారు. వీరితో పాటు ఇండిపెండెంట్లుగా ఏడుగురు అభ్యర్థులు నామినేషన్‌పత్రాలు సమర్పించారు. మంగళవారం వీటిని పరిశీలించిన ఎన్నికల అధికారులు డీఎంకే, అన్నాడీఎంకే అభ్యర్థుల నామినేషన్లను అంగీకరించారు. ఇండిపెండెంట్లకు మద్దతుగా ఒక్క ఎమ్మెల్యే కూడా సంతకం చేయకపోవడంతో ఆ నామినేషన్‌పత్రాలను తోసిపుచ్చారు. మరోవైపు నామినేషన్ వాపసు గడువు వచ్చే 12వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ముగియనుంది. ఇందువల్ల డీఎంకే, అన్నాడీఎంకే అభ్యర్థులకు పోటీగా మరెవ్వరూ లేనందున వారు గెలుపొందినట్లు గురువారం అధికారికంగా ప్రకటించి ధృవీకరణపత్రాలు కూడా అందజేయనున్నట్లు ఎన్నికల విభాగం అధికారులు తెలిపారు.



తిరువళ్లువర్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం రాజ్‌భవన్‌లో ఆయన విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి

ప్రభుత్వ బడిలో న్యాయమూర్తి కుమార్తె

- అది కూడా తమిళమాధ్యమం
- సర్వత్రా ప్రశంసల వర్షం



విజయభారతికి అడ్మిషన్ అందజేస్తున్న హెచ్‌ఎం.ధనపాల్

చెన్నై, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తమ బిడ్డల్ని ప్రైవేటు బడుల్లో.. అది కూడా ఆంగ్ల మాధ్యమంలోనే చదివించాలని పట్టుబట్టి మరీ పరుగులు తీస్తున్న ఈ యుగంలో మాతృభాషపై మమకారం కలిగిన ఓ న్యాయమూర్తి తన బిడ్డను ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని నిర్ణయించుకున్నారు. వివరాలిలా .. తెన్‌కాశి జిల్లా శంకరన్ కోవిల్ ప్రాంతానికి చెందిన విజయభారతి పుదుకోట జిల్లా సెషన్స్ జడ్జిగా కొన్నేళ్లు పనిచేశారు. ఇటీవల ఆయనకు శివకాశి కోర్టు బదిలీ అయ్యారు. శివకాశి సెషన్స్ కోర్టు జడ్జిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన విజయభారతి తన ఏడేళ్ల కుమార్తె అన్బికినియాల్‌ను విశ్వనత్తం ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో తమిళ మాధ్యమంలో రెండో తరగతిలో చేర్పించారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధనపాల్, ఉపాధ్యాయులు న్యాయమూర్తి విజయ భారతిని సాదరంగా ఆహ్వానించారు. ఆ తర్వాత ఆయన కుమార్తెకు అడ్మిషన్ పత్రాన్ని టైప్ చేసి, నకలు అందజేశారు. ఈ సందర్భంగా జడ్జి విజయభారతి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు కూడా ప్రస్తుతం ప్రైవేటు పాఠశాలలతో పోటీపడేలా నాణ్యమైన విద్యనందిస్తున్నాయని, అందుకే తన కుమార్తెను సర్కారు బడిలో చేర్పించినట్లు తెలిపారు. తమిళ మాధ్యమంలో చదివే విద్యార్థులు కూడా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని, తామంతా ఆ మాధ్యమం చదివే వచ్చామని ఆయన చెప్పారు. కాగా తన కుమార్తెను ప్రభుత్వ బడిలో చదివించాలని నిర్ణయించిన ఆ న్యాయమూర్తిని నెటిజట్లు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు.

విద్యా నిధులు కేటాయించండి

- కేంద్రానికి హైకోర్టు ఆదేశం

చెన్నై, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నిర్బంధ విద్యాహక్కు చట్టం ప్రకారం చెల్లించాల్సిన నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాలని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. 'మరుమలర్చి ఇయక్కమ్' అనే స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు వి.ఈశ్వరన్ దాఖలు చేసిన పిటిషన్‌లో... నిర్బంధ విద్యాహక్కు చట్టం ప్రకారం నిరుపేద, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం రిజర్వేషన్ ప్రాతిపదికన అడ్మిషన్లు కల్పిస్తున్నారని వివరించారు. అయితే ఆ రిజర్వేషన్ అమలుకు అయ్యే ఖర్చులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నిధులు విడుదల చేస్తాయని, అయితే విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ 25 శాతం రిజర్వేషన్ల ప్రాతిపదికన అడ్మిషన్లు ప్రారంభించలేకున్నారని, నిధులు విడుదల చేయడమే మంచిదని పేర్కొన్నారు. మంగళవారం న్యాయమూర్తులు జీఆర్ సామినాథన్, వి.లక్ష్మీనారాయణన్‌తో కూడిన ధర్మాసనం ఎదుట ఈ పిటిషన్ విచారణకు వచ్చింది. నిర్బంధ విద్యాహక్కుల చట్టం ప్రకారం నిరుపేద, ఆర్థికంగా వెనుకబడిన (ఈబీసీ) విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలు 25 శాతం రిజర్వేషన్లు అమలు చేసి అడ్మిషన్లు కల్పిస్తున్నాయని, ఈ రిజర్వేషన్ అమలు చేసేందుకు అయ్యే ఖర్చులకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులను విడుదల చేస్తాయన్నారు. అయితే 2021 నుండి 2023 వరకు కేంద్ర ప్రభుత్వం ఆ నిధులను విడుదల చేయలేదని, మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోందని ప్రభుత్వం తరఫున హాజరైన న్యాయవాది రవీంద్రన్ పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలలకు చెల్లించాల్సిన నిధులు చెల్లించకపోతే ఆ పాఠశాలలు నష్టపోతాయని తాము భావిస్తున్నామన్న న్యాయమూర్తులు ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం రిజర్వేషన్ల అమలు చేయడం వల్ల ఆ పాఠశాలల వ్యయభారం తగ్గించేలా కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం జాప్యం చేయకుండా నిధులు విడుదల చేయాలని ఉత్తర్వులు జారీచేశారు.

కూటమి లేకుండా డీఎంకే విజయం అసాధ్యం

- ఈసారి 10 సీట్లు అడుగుతాం
- సీపీఎం నేత షణ్ముగం



చెన్నై, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో కూటమి లేకుండా డీఎంకే గెలవడమన్నది అసాధ్యమని, 2019 లోక్‌సభ ఎన్నికల నుండి 2024 లోక్‌సభ ఎన్నికల దాకా మిత్రపక్షాలను కలుపుకునే ఆ పార్టీ గెలిచిందని, ఈ పరిస్థితి వచ్చే యేడాది జరిగే శాసనసభ ఎన్నికల్లోనూ కొనసాగుతుందని సీపీఎం రాష్ట్ర కమిటీ కార్యదర్శి పి.షణ్ముగం వ్యాఖ్యానించారు. నగరంలో మంగళవారం ఉదయం మీడియాతో మాట్లాడుతూ... డీఎంకే కూటమిలో ప్రస్తుతం కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, డీపీఐ, ఎండీఎంకే, ఎంఎన్‌ఎం పార్టీలు మిత్రపక్షాలుగా ఉన్నాయని, వారిని ముఖ్యమంత్రి స్టాలిన్ కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నారని, ఈ సారి శాసనసభ ఎన్నికల్లో మిత్రపక్షాలకు గతం కంటే ఎక్కువ సీట్లను కేటాయిస్తారని ఆశిస్తున్నామని చెప్పారు. 2021లో జరిగిన ఎన్నికల్లో ఎక్కువ సీట్లు కావాలని పట్టుబట్టినా, అప్పట్లో అన్నాడీఎంకే- బీజేపీ కూటమి ఎట్టి పరిస్థితుల్లోనూ గెలువకూడదనే ఏకైక లక్ష్యంతో డీఎంకే కేటాయించిన సీట్లే తీసుకున్నామని చెప్పారు. సీపీఎం రాష్ట్ర చరిత్రలోనే అంత తక్కువ స్థానాల్లో పోటీ చేయడం అదే ప్రథమమని చెప్పారు. అలాంటి పరిస్థితి వచ్చే యేడాది జరుగబోయే శాసనసభ ఎన్నికల్లో పునరావృతం కాకూడదని తెలిపారు. ఈసారి శాసనసభ ఎన్నికల్లో డీఎంకే అధిష్ఠానవర్గం పట్టువిడుపులకు పోకుండా సీపీఎంకు కనీసం 10 అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని షణ్ముగం డిమాండ్ చేశారు.

డీఎంకే పాలన భేష్..

రాష్ట్రంలో గత నాలుగేళ్లుగా డీఎంకే పరిపాలన అన్ని వర్గాలూ మెచ్చుకునేలా కొనసాగిందని, ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలనే కాకుండా చెప్పని కొత్త హామీలను కూడా నెరవేర్చిందని, ముఖ్యంగా మహిళాభ్యుదయానికి పెద్దపీట వేసిందని షణ్ముగం ప్రశంసించారు. రాబోయే పది నెలల్లోనూ ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని సూచించారు.



అమిత్ షాకు స్వాగతం పలుకున్న కేఆర్ వెంకటేష్

ఇదేంటి అమిత్ జీ?!

హోం మంత్రికి రౌడీ స్వాగతం చెప్పడమా !


- తమిళ పత్రిక కథనం

అడయార్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మదురై వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు వివిధ కేసులు పెండింగ్‌లో వున్న మిలగాయ్‌పొడి వెంకటేష్ అలియాస్ కేఆర్ వెంకటేష్ స్వాగతం పలికారంటూ ఓ తమిళపత్రిక కథనం ప్రచురించింది. 60కి పైగా కేసులున్న ఆ రౌడీని అమిత్‌షా ఎలా దగ్గరికి చేరనిచ్చారంటూ ఆ పత్రిక నిలదీసింది. ఆ పత్రిక కథనం మేరకు వివరాలిలా ... రాష్ట్రంలోనే కాకుండా, పొరుగు రాష్ట్రాల్లో అనేక నేరాలు ఘోరాలకు, కిడ్నాప్‌లు, దోపిడీలు, హత్యలు, హత్యాయత్నాలకు పాల్పడిన అనేకమంది ఇటీవలి కాలంలో రాష్ట్ర బీజేపీలో చేరుతున్నారు. ఇలాంటి వారిలో మిలగాయ్ వెంకటేష్ ఒకరు. ఈయనకు కె.అన్నామలై పార్టీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో పార్టీ సభ్యత్వం కల్పించడంతో పాటు ఓబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా నియమించారు. ఈ పదవి పొందేందుకు ఆయన కోట్లాది రూపాయలు ఖర్చు చేశారని బీజేపీ నేతలే వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుతం వెంకటేష్‌పై దాదాపు 60కు పైగా కేసులున్నాయి. ఆంధ్రా పోలీసులు పలుమార్లు అరెస్టు చేయగా, బెయిలపై విడుదలయ్యారు. కొన్ని నెలల క్రితం ఆవడి పోలీసులు కూడా అరెస్టు చేసి గూండా చట్టాన్ని ప్రయోగించారు. అలాగే, చెన్నై నగరంలో పేరు మోసిన రౌడీల జాబితాలో కేఆర్ వెంకటేష్ పేరు కూడా ఉంది. ఈ నేపథ్యంలో ఇటీవల మదురై వచ్చిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికేందుకు రాష్ట్ర పార్టీ ఏర్పాటు చేసిన పదిమంది కమిటీ సభ్యుల్లో ఈ రౌడీకి కూడా స్థానం కల్పించారు. ప్రస్తుత అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, మరో ముఖ్యనేత వినోజ్ పి.సెల్వం సిఫార్సుతోనే ఈ కమిటీలో కేఆర్ వెంకటేష్‌కు చోటు దక్కిందనే ప్రచారం పార్టీ నేతల్లోనే వినిపిస్తోంది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ అమిత్ షాతో ఫొటోలు దిగి, వాటిని తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల పోలీసులతో పాటు పీఎంవో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆర్‌ఆర్‌ఎస్ ఆర్గనైజేషన్, అన్నామలై, కేశవ వినాయగం, కేంద్రమంత్రి మురుగన్ తదిరులకు ట్యాగ్ చేయడం ఇపుడు చర్చనీయాంశంగా మారింది. నగర మాజీ ఉప మేయర్ కరాటే త్యాగరాజన్ వంటి నేతలు అమిత్ షాకు స్వాగతం పలికేందుకు అనుమతి కోరినా ఇవ్వని బీజేపీ రాష్ట్ర పెద్దలు.. వివాదాస్పదుడికి స్వాగత కమిటీలో స్థానం కల్పించడంపై సీనియర్లు అసంతృప్తితో వున్నారు. అమిత్ షాకు స్వాగతం పలికేందుకు అతడి కంటే గొప్ప నేతలెవ్వరూ లేరా అంటూ వారు ప్రశ్నిస్తున్నారు. అమిత్ షాకు స్వాగతం పలికే వ్యక్తుల చరిత్రను ఒకసారి పరిశీలించి, అనుమతిస్తే బావుండేదని వారు అభిప్రాయం వ్యక్తం చేసారు..

తిరుచ్చిలో ఎంజీఆర్ బంగళా అన్యాక్రాంతం

- కబ్జాకు గురైన రూ.25 కోట్ల స్థలం
- వారసులకు అప్పగించాలని కలెక్టర్‌కు మాజీ సర్వేయర్ వినతి

చెన్నై, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎంజీఆర్‌కు తిరుచ్చిలో ఉన్న బంగళా, ఇతర ఆస్తులను వారసులకు అప్పగించాలంటూ మాజీ సర్వేయర్ జిల్లా కలెక్టర్‌కుఓ వినతి పత్రం సమర్పించారు.తిరుచ్చి ఉరయూరు ప్రాంతంలో ఎంజీఆర్ ఓ బంగళా కొనుగోలు చేసి తాను తిరుచ్చి వెళ్లినప్పుడల్లా ఆ భవనంలోనే బసచేసేవారు. దశాబ్దాలు గడిచినా ఆ బంగళా ఇంకా చెక్కుచెదరలేదు. ఈ నేపథ్యంలో తిరుచ్చి నార్త్ కాట్టూరు గాంధీనగర్‌కు చెందిన రిటైర్డ్ సర్వేయర్ ఛార్లెస్ తిరుచ్చి జిల్లా కలెక్టర్ ప్రదీప్‌కుమార్‌కు ఓ వినతి పత్రం సమర్పించారు. తిరుచ్చి ఉరయూరు తిరుతాందోణి రోడ్డు ప్రాంతంలో ఎంజీఆర్‌కు చెందిన బంగళా, ప్రహరీతో కూడిన 80 వేల చదరపుటడుగుల స్థలం ఉందని, ప్రస్తుతం ఆ స్థలం విలువ రూ.25 కోట్లని పేర్కొన్నారు. ఎంజీఆర్ మృతి చెందిన తర్వాత ఆయన సోదరుడు ఎంజీ చక్రపాణి కుమారులను వారసులుగా ఆ స్థలం వారి పేరుతో పట్టాగా రిజిస్టర్ చేశారు. ఆ తర్వాత ఆ పట్టాలో వారసుల పేర్లు తొలగించి 'అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి' పేరిట పట్టా రిజిస్టర్ చేశారు. కొంతకాలం తర్వాత ఆ పేరు కూడా తొలగించి ఓ ప్రైవేటు వ్యక్తి పేరుతో రిజిస్టర్ చేశారు. ఎంజీఆర్ వారసుల పేర్లును తొలగించాలంటే ఆర్డీవోకు దరఖాస్తు పెట్టుకుని, ఆయన అనుమతి పొందిన మీదటే ఆ వారసుల పేర్లు తొలగించాల్సి ఉంది. అయితే ఈ పద్ధతి పాటించలేదు. ఈ విషయాన్ని సర్వేయర్ ఛార్లెస్ ఆర్డీవో దృష్టికి తీసుకెళ్ళారు. ఆ మేరకు 2021 అక్టోబర్‌లో ఆర్డీవో రెండు సార్లు ఛార్లెస్‌ను విచారించారు.. తిరుచ్చిలో ఉన్న ఆస్తులను ఎంజీఆర్ అన్నాడీఎంకే పేరిట రాసారా? లేక ఏదైనా వీలునామా రాసి ఉంచారా? అనే సందేహాలను నివృత్తి చేసేలా ఆర్డీవో కార్యాలయంలో ఉన్న రికార్డులను పరిశీలించి విచారణ జరపాలని ఛార్లెస్ జిల్లా కలెక్టర్‌కు అందజేసిన వినతిపత్రంలో కోరారు. ప్రస్తుతం ఎంజీఆర్ వారసులు చాలా మంది పేదరికంలో ఉన్నారని, తిరుచ్చి ఉరయూరులోని ఆస్తులన్నింటిని వారికి అప్పగించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.



తిరుచ్చి ఉరయూరులోని ఎంజీఆర్ బంగళా

నగరంలో భారీ వర్షం

- గాలిలో చక్కర్లు కొట్టిన విమానాలు

ప్యారీస్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం, శివారు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో ప్రజలు ఉపసమనం పొందారు. సాయంత్రం 4 నుంచి 6.30 గంటల వరకు నగరంలోని నుంగంబాక్కం, టి.నగర్, ఎగ్మూర్, మేడవాక్కం, అడయార్, పెరంబూర్, వ్యాసర్పాడి, కొడుంగైయూర్, మైలాపూర్, తాంబరం, విమానాశ్రయ ప్రాంతం మీనంబాక్కం సహా త్రిశూలం, పల్లావరం ప్రాంతాల్లో కుండపోత వర్షం కురిసింది. దీని కారణంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన 8 ఇండిగో విమానాలు రన్‌వేపై భారీగా వర్షపు నీరు నిలిచివుండటంతో ల్యాండింగ్ కాలేక, వాతావరణం అనుకూలించే వరకు గాల్లో చక్కర్లు కొట్టినట్టు విమానాశ్రయ అధికారులు తెలిపారు.



మంగళవారం సాయంత్రం చెన్నైలో కురుస్తున్న వర్షం



పుదుకోటలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణ్యం

గర్భిణులు, వృద్ధులు మాస్కు ధరించండి : మంత్రి సుబ్రమణ్యం

చెన్నై,జూన్10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గర్భిణులు, వృద్ధులు మాస్కులు ధరించడమే మంచిదని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం సూచించారు. పుదుకోటలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆ జిల్లాలో రూ.7.62 కోట్లతో నిర్మించిన 21 ఆస్పత్రి భవనాలను ఆయన ప్రారంభించారు.అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం ఒమ్మైక్రాన్ రకానికి చెందిన కరోనా వైరస్ వ్యాప్తి చెందుతున్నప్పటికీ దానివల్ల ప్రాణాపాయం ఉండదని స్పష్టం చేశారు. విపరీతమైన జ్వరం, గొంతునొప్పి, జలుబుతో బాధపడుతున్నవారంతా సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్ళి వైద్యపరీక్షలు చేయించుకోవడం మంచిదని అన్నారు.బహిరంగ ప్రదేశాలలో మాస్కులు ధరించాలన్న నిబంధన ఏదీ లేదని, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు,జ్వరం,జలుబుతో బాధపడుతున్నవారు తప్పనిసరిగా మాస్కుధరించాలని ఆయన చెప్పారు.

సమాచార దర్శిని

డబ్ల్యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక తరగతులు

ప్యారీస్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్ జీఎన్‌చెట్టి రోడ్డులోని ప్రపంచ తెలుగు సమాఖ్య (డబ్ల్యూటీఎఫ్)- ట్రూత్ స్పిరిచ్యువల్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 28, 29 తేదీల్లో డబ్ల్యూటీఎఫ్ కార్యాలయంలో ఆధ్యాత్మిక తరగతులు నిర్వహించనున్నారు. ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్న ఈ తరగతుల్లో పాల్గొనదలచిన అభ్యర్థులు విరాళంగా రూ.1000లను చెల్లించాల్సి ఉంటుంది. వివరాలకు 9677135544 అనే నెంబర్‌లో తరగతుల నిర్వాహకురాలు ఎన్.సంధ్యను సంప్రదించాలని డబ్ల్యూటీఎఫ్ పేర్కొంది.

ఎస్‌ఐ రాత పరీక్షలు వాయిదా

ప్యారీస్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పోలీస్‌శాఖలో ఖాళీగా ఉన్న ఎస్‌ఐ పోస్టుల భర్తీకి ఈ నెల 28, 29 తేదీల్లో జరగాల్సిన రాత పరీక్షలను తమిళనాడు యూనిఫామ్ ఉద్యోగుల పరీక్షల బోర్డు వాయిదా వేసింది. సుప్రీంకోర్టు ఓ కేసులో వివరణ కోరుతూ ఆదేశించిన నేపథ్యంలో రాష్ట్ర పోలీస్‌శాఖ పోస్టుల భర్తీకి సంబంధించి కౌంటర్ దాఖలు చేయాల్సి ఉండటంతో ఎస్‌ఐ పరీక్షలను వాయిదా వేసినట్లు బోర్డు ప్రకటించింది. సుప్రీంకోర్టులో కేసు విచారణ కొలిక్కి రాగానే ఎస్ పోస్టులకు రాత పరీక్షల తేదీని ప్రకటిస్తామని బోర్డు అధికారులు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్యారీస్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

ఈస్ట్ మొగప్పేర్...

ఇళంగోనగర్, మూర్తినగర్, ఆఫీసర్స్ కాలనీ, పింక్ అవెన్యూ, సత్యవతినగర్, కోరట్టూర్, కేఆర్‌నగర్, దేవదాస్ వీధి, నందనంవీధి, జానకీరామన్‌కాలనీ, కస్తూరినగర్ 1నుండి 3 వీధులు, తిలైనగర్ 17 నుండి 24 వీధులు, 37 నుండి 42 వీధులు, సెంట్రల్ అవెన్యూ, రైల్వేస్టేషన్‌రోడ్డు, గాంధీరోడ్డు, ఏరికరైవీధి, నార్త్ అవెన్యూ, పుదుపాక్కం, నెర్పుంద్రం, అక్కపాళయం, సోత్తుపెరుంబేడు, కలియంపాళయం, భగవాన్‌పాళయం, నాయిరు, మబూస్‌ఖాన్‌పేట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ బోర్డు తెలిపింది.

ప్లస్-1 రీ వాల్యుయేషన్‌కు నేటినుంచి దరఖాస్తులు

. ప్యారీస్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఈ విద్యాసంవత్సరం మార్చిలో ప్లస్‌వన్ పరీక్షలు రాసిన విద్యార్థులు రీవాల్యుయేషన్ కోసం బుధవారం నుండి దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వ పరీక్షల బోర్డు ఓ ప్రకటనలో తెలిపింది. ప్లస్‌టూ పరీక్షల మూల్యాంకన నకలు కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు https://www.dge.tn.gov.in/ వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపింది. రీవాల్యుయేషన్‌కు అదే వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తును పూర్తి చేసి బుధవారం నుండి 13వ తేదీ వరకు సంబంధిత జిల్లా ప్రభుత్వ పరీక్షల బోర్డు అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయంలో సమర్పించవచ్చు. రీవాల్యుయేషన్‌కు ఒక పా ఠ్యాంశానికి రూ.505 ఫీజు నగదుగా కానీ, డీడీ రూపంలో చెల్లించవచ్చని పరీక్షల బోర్డు తెలిపింది.

వసతి గృహాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అడయార్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): చెన్నై జిల్లాలో బీసీ, ఓబీసీ, మైనారిటీ సమాజిక వర్గాల విద్యార్థులు ప్రభుత్వ వసతి గృహాల్లో చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. వీటిని వచ్చే నెల 15వ తేదీలోగా అందజేయాల్సి ఉంటుందని చెన్నై జిల్లా కలెక్టర్ లక్ష్మి సిద్ధార్థ్ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ప్రభుత్వం తరఫున 12 పురుషుల ప్రభుత్వ కాలేజీలు, ఆరు మహిళల కాలేజీ హాస్టల్స్ ఉన్నాయి. ఈ వసతి గృహాల్లో డిగ్రీ, ఐటీఐ, పీజీ వంటి కోర్సుల్లో చదివే విద్యార్థులకు బస, ఆహారం సౌకర్యం కల్పిస్తోంది. ఇపుడు వీటిలో చేరదలచిన విద్యార్థులు వచ్చే నెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

2,299 గ్రామ సహాయకుల పోస్టుల భర్తీ

ప్యారీస్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూడేళ్లకు పైగా ఖాళీగావున్న గ్రామ సహాయకుల పోస్టులను భర్తీచేసేందుకు రాష్ట్రప్రభుత్వం మంగళవారం సాయంత్రం జీవో విడుదల చేసింది. తమిళనాడు గ్రామ సహాయకుల ఉద్యోగ నిబంధనలు-గ్రామ సహాయకుల నియామకంలో సవరించిన నిబంధనలకు సంబంధించిన నివేదికను అన్ని జిల్లాల కలెక్టర్లకు సచివాలయం ఉత్తర్వులు జారీచేసింది. ఆ మేరకు ఖాళీగావున్న 2,299 గ్రామ సహాయకుల ఎంపికపై చర్యలు చేపట్టాల్సిందిగా కలెక్టర్లకు రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

రక్తం సేకరణలో జీహెచ్ ప్రథమస్థానం

ప్యారీస్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అధికమొత్తంలో రక్తం నిల్వవుంచడంలో చెన్నై రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఆస్పత్రి రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో ఉందని ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. రాజీవ్‌గాంధీ ప్రభుత్వాసుపత్రి ఆధ్వర్యంలో మొబైల్ వ్యాన్ల ద్వారా నగరంలోని 200 వార్డుల్లో రక్తదాతల నుంచి ఆస్పత్రి వైద్యులు, నర్సులు రక్తం సేకరిస్తున్నారు. మరోవైపు విద్యాసంస్థల్లో రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఈ నెల 14వ తేదీ ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని బ్లడ్ బ్యాంక్‌పై ప్రజల్లో భారీస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ ఆస్పత్రిలో గత ఏడాది దాతల నుండి 30 వేల యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఇందులో ఒక యూనిట్ రక్తాన్ని గ్రూపుల వారీగా విభజించి భద్రపరిచి, ప్రాణాపాయ స్థితిలోవున్న రోగులకు అందిస్తున్నారు. కాగా, రాష్ట్రంలోని ప్రభుత్వాసుత్రుల్లో పనిచేస్తున్న బ్లడ్ బ్యాంకుల్లో కెల్లా అధిక రక్తాన్ని నిల్వవుంచడంలో రాజీవ్‌గాంధీ ప్రభుత్వాస్పత్రి ప్రథమస్థానంలో ఉందని అధికారులు తెలిపారు.

భూమి కొనుగోళ్లకు సహకార బ్యాంకుల్లో రుణాలు

ప్యారీస్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యవసాయ పనుల్లో పాల్గొంటున్న పేదకుటుంబాల మహిళలకు భూములు కొనుగోలు చేసేందుకు సహకార బ్యాంకుల నుండి రూ.5లక్షలు రుణ సహాయ పథకం ప్రారంభమైంది. రాష్ట్రంలో సహకార శాఖ ఆధ్వర్యంలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు రుణాలిస్తున్నాయి. ప్రస్తుతం వ్యవసాయ పనులకు వెళ్తూ సొంత భూమిలేని పేద మహిళా రైతు కూలీలను ప్రోత్సహించేలా రెండెకరాల వరకు వ్యవసాయ భూములను కొనుగోలు చేయవచ్చు. ఇందు సహకార బ్యాంకుల నుండి రూ.5 లక్షల వరకు రుణంగా పొందవచ్చు. అంతేకాకుండా పశువుల పెంపకం కోసం థాట్కోలో రాయితీతో కూడిన రుణాలు పొందవచ్చు. ఈ రెండు రుణాలు కలిపి ఒక్కో లబ్ధిదారునకు రూ.8లక్షల వరకు రుణం అందజేసే పథకానికి సోమవారం సహకారశాఖ శ్రీకారం చుట్టింది.

రెట్టేరి అభివృద్ధి పనులు రెండు నెలల్లో పూర్తి



పెరంబూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెట్టేరి చెరువు అభివృద్ధి పనులు రెండు నెలల్లో పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ చెరువు అభివృద్ధి పనులు రూ.43.19 కోట్లతో జరుగునున్నాయి. చెరువులో పూడికతీత, గట్టు పటిష్ఠత, అదనపు జలాలు బయటకు వెళ్లేందుకు రెగ్యులేటర్ల ఏర్పాటు, చెరువు మధ్యలో ఇసుక తిన్నెలు తదితర అభివృద్ధి పనులు చేపట్టారు. అలాగే, చెరువు చుట్టూ కంచె నిర్మాణం జరుగుతోంది. ప్రస్తుతం ఈ చెరువులో 32 మిలియన్ ఘనపుటడుగుల నీరు నిల్వచేసే సామర్థ్యం ఉండగా, పనులు పూర్తయితే 45 మిలియన్ ఘనపుటడుగుల నీరు నిల్వచేయవచ్చు. ప్రస్తుతం ఎంజీఆర్ నగర్ సమీపంలో అడ్డుకంచె, కాలిబాట నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

నిర్మాణాలకు అనుమతి ఫీజు గడువు 60 రోజులకు పెంపు

ప్యారీస్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భవన నిర్మాణాల అనుమతి ఫీజు గడువును 60 రోజులకు పెంచుతూ రాష్ట్రప్రభుత్వం అనుమతిచ్చింది. భవన నిర్మాణాల నిబంధనల మేరకు నిర్మాణ పథకాలకు స్థానిక సంస్థలు, పంచాయతీరాజ్, మున్సిపాలిటీ, కార్పొరేషన్లు, సీఎండీఏ నుంచి అనుమతి పొందాల్సివుంటుంది. ఇందులో భవన నిర్మాణం పథకం అనుమతులను త్వరిత గతిన పూర్తిచేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా దరఖాస్తుల పరిశీలన పూర్తిచేసి నిర్మాణాలకు ఫీజు నిర్ణయిస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న రోజునుండి 30 రోజుల నుండి నిర్ణయించిన ఫీజును ఆన్‌లైన్ ద్వారా చెల్లించాల్సివుటుంది. 30 రోజులు దాటినట్లైతే, ఆ ఫీజుతో పాటు వడ్డీ కూడా చెల్లించాలి. సమయాన్ని పెంచాలని భవన నిర్మాణ యజమానుల సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశాయి. దీనిపై స్పందించిన ప్రభుత్వం కట్టడాల అనుమతి ఫీజు చెల్లింపును 30 రోజుల నుండి 60 రోజులకు పెంచింది, దీనికి సంబంధించిన జీవో త్వరలో విడుదలవుతుందని అధికారులు తెలిపారు.

టోల్‌గేట్లలో సుంకం వసూలు వ్యవహారం... హైకోర్టు 'స్టే'కు సుప్రీం బ్రేక్

ప్యారీస్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మదురై-తూత్తుకుడి మధ్య ఉన్న రెండు టోల్‌గేట్లలో వాహనాల నుంచి సుంకం వసూలు చేసేందుకు హైకోర్టు విధించిన స్టే నిలుపుదలవేస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వు జారీచేసింది. తూత్తుకుడి జిల్లాకు చెందిన బాలకృష్ణన్ మద్రాస్ హైకోర్టు బెంచ్‌లో దాఖలు చేసిన పిటిషన్‌లో మదురై-తూత్తుకుడి మధ్యవున్న హైవేపై రెండు టోల్‌గేట్లలో వాహనాలకు ప్రతినెలా రూ.11కోట్లు సుంకంగా వసూలు చేస్తున్నాయని, అలా వసూలైన నిధులలో అక్కడి రోడ్ల మరమ్మతులకు రూ.30లక్షలు మాత్రమే ఖర్చుపెట్టి, కోట్లాది రూపాయలను దుర్వినియోగం చేస్తున్నారని, ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆ రెండు టోల్‌గేట్ల వద్ద సుంకం వసూలు రద్దు చేయాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ సంబంధిత రెండు టోల్‌గేట్లలో సుంకం వసూలు చేసేందుకు నెల 3 న స్టే విధించింది. దీనిపై జాతీయ రహదారుల కమిషన్ సుప్రీంకోర్టులో అప్పీలు పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌పై న్యాయమూర్తులు ప్రశాంత్‌కుమార్ మిశ్రా, మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. ఆ బెంచ్ ముందు జాతీయ రహదారుల కమిషన్ తరుపున హాజరైన అడిషనల్ సోలిసిటర్ జనరల్ వెంకటరామన్ రోడ్డు మరమ్మతులు జరుగుతున్నందున హైకోర్టు విధించిన స్టేను రద్దు చేయాలని వాదించారు. పిటిషనర్ తరుపున హాజరైన న్యాయవాది విల్సన్ ఆ స్టే రద్దు చేయకూడదని వాదించారు. ఇరువైపు వాద, ప్రతివాదనల అనంతరం మదురై-తూత్తుకుడి మధ్యలోని రెండు టోల్‌గేట్లలో సుంకాల వసూలుపై హైకోర్టు విధించిన 'స్టే' ఉత్తర్వులను నిలుపుదల చేస్తూ ఆదేశాలిచ్చింది. కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని పిటిషనర్‌కు ఉత్తర్వులిచ్చింది.

కిరాయి ముఠాతో రెండో భార్య హత్యకు కుట్ర

● ఇద్దరు రౌడీల అరెస్టు

అడయార్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉంటున్న భర్త నగరంలోని తన రెండో భార్యను హత్య చేసేందుకు కిరాయి ముఠాతో వేసిన ప్లాన్ వికటించింది. దీంతో నగర పోలీసులు ఇద్దరు కిరాయి హంతకులను అరెస్టు చేశారు. స్థానిక చూలైమేడుకు ప్రాంతానికి చెందిన బెనజీర్ బేగం (33) భర్త జాకీర్ హుస్సేన్ (37) విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నాడు. వీరిద్దరికీ 12 యేళ్ళ క్రితం వివాహమైంది. అయితే, జాకీర్ హుస్సేన్‌కు ఇంతకుముందే వివాహమై ఇద్దరు పిల్లలున్నట్టు బెనజీర్ బేగంకు ఆలస్యంగా తెలిసింది. పైగా మొదటి భార్యతో విడాకుల కేసు కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో బెనజీర్ బేగం నుంచి భర్తకు వేధింపులు ఎక్కువ కావడంతో ఆమె పీడ వదిలించుకోవాలని ప్లాన్ వేశాడు. ఇందులో భాగంగా, నగరంలోని ఓ కిరాయిముఠా కు డబ్బులు పంపించి, రెండో భార్య బెనజీర్ బేగంను హత్య చేయాలని సూచించాడు. ఇందులోభాగంగా ఈ నెల 2వ తేదీన తన ఇంటిలో ఒంటరిగా ఉన్న బెనజీర్‌పై ఆటోలో వచ్చిన ఒక ముఠా దాడి చేసి గాయపరిచింది. ఈ దాడిలో బెనజీర్ తీవ్రంగా గాయపడింది. అనంతరం ఆమె ఫిర్యాదు మేరకు చూలైమేడు పోలీసులు కేసు నమోదు చేసి, సీసీ పుటేజీ ఆధారంగా తంజావూరు జిల్లాకు చెందిన పేరుమోసిన రౌడీ వినోద్ (25), అదే ప్రాంతానికి చెందిన మహ్మద్ ఆదిల్ (25)లుగా గుర్తించి అరెస్టు చేశారు. వీరిని విచారించగా అసలు విషయం బయటపడింది. రౌడీలిద్దరిని కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు. అలాగే, హత్యకు కుట్రపన్ని జాకీర్ హుస్సేన్‌తో సహా మరో వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

తిరువణ్ణామలైలో మాంసాహార భోజనం

● పరిహార పూజలు



ఆలయాన్ని సంప్రోక్షిస్తున్న అర్చకులు

ప్యారీస్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవ క్షేత్రం తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలో దంపతులు సోమవారం మాంసాహారం తినడంపై ఆందోళనకు గురైన ఆలయ అధికారులు ప్రక్షాళన పూజలు చేయించారు. ఈ ఆలయానికి వచ్చే భక్తులను తనిఖీ చేసిన తర్వాతే దర్శనానికి అనుమతిస్తుంటారు. ఈ నేపథ్యంలో, రాజగోపురం సమీపంలోని ఐదో ప్రాకారంలో సోమవారం ఓ జంట ఆలయ పవిత్రతకు భంగం కలిగించేలా మాంసాహార ఆరగిస్తుండగా, అటువైపు వెళ్లిన భక్తులు దీనిపై ఆలయ అధికారులకు ఫిర్యాదు చేశారు. తక్షణ చర్యలు చేపట్టిన అధికారులు ఆ దంపతులను పోలీసులకు అప్పగించారు. విచారణ అనంతరం ఇకపై ఇలాంటి చర్యలకు పాల్పడరాదని ఆ దంపతులను పోలీసులు హెచ్చరించి పంపించారు. ఈ నేపథ్యంలో, మంగళవారం తెల్లవారుజామున ఆలయ ప్రాంగణంలో శివాచార్యులు పరిహార పూజలు నిర్వహించారు. దంపతులు మాంసాహారం తిన్న ప్రాంతం సహా ఆలయ ప్రాంగణం అంతా పవిత్ర జలాలను సంప్రోక్షించారు.

పీఎంకే న్యాయవిభాగ అధ్యక్షుడి తొలగింపు



పదవి కోల్పోయిన న్యాయవాది బాలు

ప్యారీస్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పీఎంకే వ్యవస్థాపకులు డాక్టర్ రాందాస్ సామాజిక పార్టీ న్యాయవిభాగం అధ్యక్షుడు బాలును మంగళవారం ఆ పదవి నుంచి తొలగించారు.. పీఎంకేలో తండ్రికొడుకుల మధ్య ఇటీవల కాలంలో చోటుచేసుకున్న విభేదాలను తొలగించేందుకు పలు రాజకీయ పార్టీ ప్రముఖులు వారితో చర్చల్లో పాల్గొంటున్న విషయం తెలిసిందే!. పార్టీని స్థాపించిన తానే శాశ్వత అధ్యక్షుడినని పదేపదే పలు వేదికలపై ప్రకటించుకుంటున్న డాక్టర్ రాందాస్ తన కుమారుడికి సన్నిహితులైన వారిని పార్టీ పదవుల నుండి తొలగించి కొత్తవారిని నియమిస్తున్నారు. ఆ క్రమంలో పార్టీని స్థాపించినప్పటి నుండి సామాజిక న్యాయవిభాగం అధ్యక్షుడిగా పార్టీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిన సీనియర్ న్యాయవాది బాలును ఆ పదవి నుండి తొలగించిన రాందాస్, ఆయనకు బదులుగా న్యాయవాది గోకుల్‌ను నియమించినట్లు ప్రకటించడంతో పీఎంకేలో మళ్ళీ అంతర్గత కలహం ప్రారంభమైంది.

విద్యారంగం అభివృద్ధిలో డీఎంకే ప్రభుత్వం విఫలం

● బీజేపీ అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్




ప్యారీస్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వానికి ప్రకటనలపై వున్న శ్రద్ధ విద్యారంగం పట్ల లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ విమర్శించారు. ఆయన మంగళవారం తన ఎక్స్‌పేజీలో అర్హులైన సెకండ్ గ్రేడ్ టీచర్లకు ఉద్యోగావకాశాలు కల్పించకుండా రాష్ట్రప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కనీస వసతులు కల్పించడంలేదని, విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా తరగతిగతులు లేవని పలు ప్రాంతాల్లో విద్యార్థులే మరుగుదొడ్లు శుభ్రంచేసే పరిస్థితులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో 20వేలకు పైగా ఖాళీ అయిన టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. అలాగే ఉపకులపతుల నియామకంలో నిర్లక్ష్యంతో పాటు ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేయకుండా కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. టీచర్ ఎంపిక బోర్డు ద్వారా 19,260 పోస్టులను 18 నెలల వ్యవధిలో భర్తీ చేస్తామని అసెంబ్లీలో ప్రకటించిన హామీని సీఎం స్టాలిన్ అమలుపరచకుండా విద్యారంగం పట్ల నిర్లక్ష్యం చూపుతున్నారని ఆయన ఆరోపించారు.

శతాధిక వృద్ధురాలి జన్మదిన వేడుకలు

ప్యారీస్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పొన్నేరి సమీపంలోని తిరుఆయర్‌పాడి ప్రాంతానికి చెందిన అప్పాదురై సతీమణి శాంతి (100)కి నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అప్పాదురై కొన్నేళ్ళ క్రితం మృతిచెందడంతో శాంతి తన నాలుగో కుమార్తె లక్ష్మితో నివసిస్తున్నారు. ఆమెకు 24 మంది మనవలు, మరో 24 మంది మునివనవళ్లు, 8 మంది మనివనవరాళ్లు ఉన్నారు. ఈ నేపథ్యంలో, ఇటీవల వందో వసంతంలోకి అడుగుపెట్టిన వృద్ధురాలు శాంతి జన్మదిన వేడుకలను ఆమె కుటుంబ సభ్యులు వివాహ కార్యక్రమంలా చేశారు. వందేళ్ళ ప్రాయంలో కూడా శాంతి ఇంటి సమీపంలోవున్న బడ్డీకొట్టు ద్వారా వ్యాపారం చేస్తూ తమ కుమార్తెకు ఆర్థికపరంగా సహకరిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం నిర్వహించిన వేడుకల్లో తమ బామ్మకు వందో జన్మదినం జరుపుతునందుకు సంతోషంగా ఉందని వృద్ధురాలి మనవళ్లు హర్షం వ్యక్తంచేశారు.

నేడు తెన్‌కాశి జిల్లాలో నాలుగు రిజర్వాయర్ల నుండి నీటి విడుదల



రామనది డ్యాం

ప్యారీస్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లాలోని కడనానది, అడవీనయనార్, కరుప్పానది, రామనది డ్యాంల నుంచి బుధవారం సాగునీటిని విడుదల చేయనున్నట్టు ప్రజా పనులశాఖ అధికారులు తెలిపారు. జిల్లా రైతులు సాగుపనులు చేపడుతున్న నేపథ్యంలో, వారి కోరిక మేరకు ఈ ఖరీఫ్ సీజన్‌లో నాలుగు డ్యాంల నుంచి 180.37 మిలియన్ల ఘనపటడుగుల నీటిని విడుదల చేయనున్నారు. ఈ సాగునీటితో తెన్‌కాశి, కడయానల్లూరు, కృష్ణాపురం, భోగనల్లూరు, గోవిందభేరి, ఆళ్వార్‌కుచ్చి, వాగైకుళం, బేటల్‌పుదూర్, రావణసముద్రం తదితర ప్రాంతాల్లోని 1,008.19 ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు 143 రోజుల వరకు అందుతుందని అధికారులు తెలిపారు.

రేపు నగరంలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్యారీస్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో 12వ తేదీ గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

అంబత్తూరు మండలం....

టీఎస్.కృష్ణానగర్, టీవీఎస్ కాలనీ మెయిన్‌రోడ్డు, టీవీఎస్ అవెన్యూ, దేవర్ నగర్, స్కూల్‌రోడ్డు, ఎటీశ్వరన్‌కోవెల్‌వీధి, చెన్నై న్యూసిటీ, విజయనగర్, సరస్వతి నగర్, ఎడిట్ అవెన్యూ, పెరుమాళ్ కోవెల్‌వీధి, కోరడివీధి, పొన్‌రాజ్‌కుప్పం, లోటస్ అవెన్యూ, నెసవాలర్‌నగర్, రాజీవ్‌గాంధీనగర్, మేల్ అయినంబాక్కం, పులియంబేడు మెయిన్‌రోడ్డు, న్యాయమూర్తులకాలనీ, రాజాకాలనీ, నుంబళ్, దేవీనగర్, బాలాజీనగర్, భాగ్యలక్ష్మీనగర్, సూరైనగర్, అశోక్ నందనవనం, రెడ్డివీధి, భారతినగర్, రైల్వేస్టేషన్ రోడ్డు, తిరుముల్లైవాయల్, మానిక్యం పిళ్లైవీధి, చోలంబేడు రోడ్డు, మేలాంబేడు, న్యూస్ట్రీట్, ఎంటీహెచ్ రోడ్డు, మలర్‌నగర్, బసుంపొన్‌నగర్, విజయ్ అవెన్యూ, ఆటో లెగ్ కాలనీ, శ్రీనివాసన్ నగర్.

షోలింగనల్లూరు మండలం...

ఒట్టియంబాక్కం, ఒట్టియంబాక్కం మెయిన్‌రోడ్డు, నేతాజీనగర్, జోన్స్‌వీధి, వేదాంత నగర్, పల్లికరణై, సాయిగణేష్ నగర్, వీనస్వామి నగర్, సాయిబాలాజీ నగర్, వివేకానందనగర్, కృష్ణాననగర్, సుబ్రమణ్యం నగర్, వళ్లల్‌పారీ నగర్, పాంబన్‌స్వామి నగర్, మేడబాక్కం-పెరుంబాక్కం మెయిన్‌రోడ్డు, జలడియన్ పేట, ఆంజనేయనగర్, షోలింగనల్లూరు మెయిన్‌రోడ్డు, ఇండియా బుల్స్, ఏరిక్కరైరోడ్డు, ప్రభునగర్, వీరత్తమ్మాళ్ ఆలయవీధి, అండాళ్‌నగర్.

మాధవరం మండలం....

మంజబాక్కం, ఏరిక్కరై, ఆలి స్కూల్, శ్రీనివాసన్ మోడరెన్ టౌన్, రోస్ నగర్, పొన్‌నగర్, పార్వతీపురం, పారిశ్రామిక పార్కు, ముంతాజ్ నగర్, లక్ష్మీనగర్, సామ్యూల్‌నగర్.

పల్లావరం మండలం...

సుగుణ కాలనీ, స్కై పార్కు, 200ఫీట్‌రోడ్డు, టీవీఎస్ ఎమరాల్డ్, అగ్నిప్లాట్స్, నాయుడు హాలురోడ్డు, గణపతిపురంలోని ఒక ప్రాంతం, చర్చిరోడ్డు, పంచాయతీ మార్కెట్, బాలగురుస్వామివీధి, జయరామ వీధి, పళనియప్పవీధి, సొంగువేల్ వీధి, మహిమైదాన్ వీధి, భాస్కర్‌వీధి, అరుళ్ పాండ్యన్‌వీధి, రాజీవ్‌గాంధీనగర్, ఢిల్లీ వీధి, శ్రీనివాస కాలనీ, ఎంజీఆర్ రోడ్డు, అంబాళ్ కోవెల్.

పూందమల్లి మండలం...

క్వీన్ విక్టోరియా రోడ్డు, అంబాళ్ రోడ్డు, శరవణా నగర్, జేమ్స్ రోడ్డు, చక్రమంగళానగర్, శ్రీనివాసన నగర్, మల్లియం నరసింహానగర్, బలరామన్‌నగర్, సుందర్‌నగర్, శిరిడీ సాయినగర్, సుమిత్రానగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ బోర్డు తెలిపింది.

ఐసీసీ 'హాల్ ఆఫ్ ఫేమ్'లో ధోనీ

● స్టాలిన్, ఈపీఎస్ శుభాకాంక్షలు

చెన్నై, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): క్రికెట్‌లో అత్యంత ప్రతిభా పాటవాలు ప్రదర్శించి పలు విభాగాల్లో రికార్డులు సృష్టించిన భారత జట్టు మాజీ కెప్టెన్ ధోనీకి హాల్ ఆఫ్ ఫేమ్ జాబితాలో స్థానం కల్పించి అంతర్జాతీయ క్రికెట్ క్రీడా మండలి (ఐసీసీ) సత్కరించనుంది. సోమవారం సాయంత్రం ఐసీసీ విడుదల చేసిన ఈ ప్రకటనపై ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్పందిస్తూ ధోనీకి శుభాకాంక్షలు తెలియజేశారు. స్టాలిన్ తన ఎక్స్ పేజీలో వన్‌డేల్లో భారతజట్టును విజయం వైపు నడిపించి, పలుమార్లు ఐసీసీ కప్‌లు గెలుచుకుని, చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు ఐదుసార్లు ట్రోఫీ సాధించిన మేటి క్రీడాకారుడు, తన మిత్రుడు ధోనీకి అభినందనలు అని పేర్కొన్నారు. తమిళనాట క్రీడాభిమానులందరూ ధోనీని 'తల ధోనీ'గానే జేజేలు పలుకుతారని తెలిపారు. ఇదే విధంగా ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)కూడా ధోనీకి శుభాకాంక్షలు తెలుపుతూ సందేశాలు పోస్టు చేశారు.

రాష్ట్రంలో పెరిగిపోతున్న వృద్ధుల హత్యలు

● హైకోర్టు ఆవేదన

అడయార్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఒంటరిగా ఉన్న వృద్ధుల్లో హత్యలకు గురయ్యేవారి సంఖ్య పెరిగిపోతుండటంపై మద్రాస్ హైకోర్టు ఆవేదన వ్యక్తం చేసింది. మదురైకు చెందిన కేకే రమేష్ అనే వ్యక్తి హైకోర్టు మదురై బెంచ్‌లో ఒక పిటిషన్ దాఖలు చేశారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో బస్టాండులు, రోడ్డు పక్కన, రద్దీ ప్రాంతాల్లో వృద్ధులను విడిచిపెతున్నారని, మరికొందరు వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు తీసుకొచ్చి, అక్కడే వదిలి వెళుతున్నారు. ఇలాంటి వృద్ధులకు యాచన జీవనోపాధిగా మారిపోయి, అనారోగ్యానికి గురై తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి వారికోసం వృద్ధుల సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. అయినప్పటికీ రాష్ట్రంలో ఈ తరహా కేంద్రాలను ప్రారంభించలేదు. అందువల్ల రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వృద్ధుల సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని పిటిషన్‌లో కోరారు. దీన్ని విచారణకు స్వీకరించిన న్యాయమూర్తి ఎం.సుబ్రహ్మణ్యం, ఏటీ మరియగ్లాడ్‌తో కూడిన ధర్మాసనం గత కొంతకాలంగా రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఒంటరిగా ఉన్న వృద్ధులను లక్ష్యంగా చేసుకుని దోపిడీలు, హత్యలకు ఎక్కువగా జరుగుతున్నాయని ఇది తీవ్ర ఆవేదనకు గురిచేస్తుందని, వృద్ధులను రక్షించాల్సిన కర్తవ్యం ప్రభుత్వంపై ఉందని అభిప్రాయపడిన ధర్మాసనం తదుపరి విచారణను మరో రెండు వారాలకు వాయిదావేసింది.

ధర్మపురి ఎస్పీ కార్యాలయం వద్ద రైతు ఆత్మహత్య



రైతు జయరామన్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద ఈ నెల 4న ఆత్మహత్యా యత్నం చేసిన రైతు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం వేకువ జాము మృతిచెందారు. ధర్మపురి జిల్లా కీళ్‌రాజా తోప్పు గ్రామానికి చెందిన జయరామన్ (57) అనే రైతు కోళ్లఫారంనడుపుతున్నారు. తన భూములకు చెందిన పత్రాలను బంధువులు కాజేశారని, వారిపై చర్యలు తీసుకుని వాటిని తనకు స్వాధీనపరచాలని కోరుతూ ఎస్పీ కార్యాలయం వద్ద జయరామన్ వంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. పోలీసులు వెంటనే మంటలను ఆర్పి, గాయపడిన ఆ రైతును చికిత్స నిమిత్తం ధర్మపురి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స ఫలించక ఆయన మృతి చెందారు. ఈ సంఘటనపై ధర్మపురి టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

395 కిలోల గుట్కా స్వాధీనం

● సైదాపేటలో ముగ్గురి అరెస్ట్

ప్యారీస్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సైదాపేటలోని ఓ గోదాములో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన పోలీసులు చట్టవిరుద్ధంగా నిల్వవుంచిన 395 కిలో గుట్కా, పొగాకు పదార్థాలను స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్టు చేశారు. సైదాపేట రైల్వేస్టేషన్ సమీపంలోని జోన్స్‌రోడ్డులో ఉన్న ఓ గోదాము నుండి రాష్ట్రంలో నిషేధించిన హన్స్, విమల్, కూలిప్, గుట్కా, తిరంగ తదితర పొగాకు పదార్థాలను గుట్టుగా సరఫరా చేస్తున్నారనే సమాచారంతో సోమవారం సాయంత్రం పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గోదాము నుంచి రూ.1.80లక్షల నగదు, 395 కిలోల గుట్కా, సెల్‌ఫోన్, బైక్, కారు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వెస్ట్ మాంబళంకు చెందిన బాలమురుగన్, ఆసిఫ్ , రాజేష్ కన్నన్ అనే వారిని అరెస్టు చేసి మంగళవారం కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించారు.

మహిళను మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

ప్యారీస్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువీకానగర్‌లో బ్యాంకు ద్వారా రుణం ఇప్పిస్తానని నమ్మించి మహిళ నుంచి రూ.27 లక్షలు పుచ్చుకుని మోసం చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. వెస్ట్ మాంబళంకు చెందిన ప్రియాంకకు తన స్నేహితురాలి ద్వారా తిరువీకానగర్‌కు చెందిన రవికుమార్‌తో పరిచయమైంది. ప్రియాంక బ్యాంకు రుణం కోసం ప్రయత్నిస్తున్న గ్రహించిన అతను, ఆమెకు పెద్దమొత్తంలో బ్యాంకు రుణం ఇప్పిస్తానని నమ్మించినట్లు తెలిసింది. అందుకు బ్యాంకులో ముందుగా రూ.27లక్షలు చెల్లించాలని చెప్పి, పలు విడతలగా ప్రియాంక దగ్గర నుంచి వసూలు చేసి రుణం ఇప్పించకుండా మోసం చేసినట్లు సమాచారం. ప్రియాంక ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా రవికుమార్ (48)ని అరెస్టు చేసిన పోలీసులు కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ప్రేమ వ్యవహారంలో విద్యార్థి ఆత్మహత్య

ప్యారీస్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామాపురంలో ప్రేమ వ్యవహారంలో ఓ ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. రామాపురానికి చెందిన వెంకటేశన్-కయల్‌విలి దంపతుల కుమారుడు రాజా (17) నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. అతను కోడంబాక్కంకు చెందిన 19ఏళ్ళ విద్యార్థినిని ప్రేమించిన విషయం తెలిసి తల్లిదండ్రులు మందలించారు. అంతేకాకుండా రాజా, అతడి తల్లిదండ్రులపై వలసరవాక్కం మహిళా పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థిని కుటుంబీకులు ఫిర్యాదు చేయడంతో రాజా కుటుంబంపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో మనస్తాపం చెందిన రాజా సోమవారం రాత్రి ఇంట్లో అంతా నిద్రపోతున్న సమయంలో ఫానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఈ ఘటనపై విచారణ జరిపిన పోలీసులు తెలిపారు.

నీటి తొట్టెలో మునిగి చిన్నారి మృతి

ప్యారీస్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాంబరం సమీపంలోని గౌరివాక్కంలో ఆడుకుంటూ నీటి తొట్టెలో పడి ఊపిరాడక రెండేళ్ళ చిన్నారి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. గౌరివాక్కం ప్రాంతానికి ఉపాధి కోసం పశ్చిమ బెంగాల్‌కు చెందిన 30కి పైగా కార్మికుల కుటుంబాలు వచ్చి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. ఆ ప్రాంతంలో ఓ సంస్థ ప్రాంగణంలో నిర్మిస్తున్న భవనం పనుల్లో ఆగ్రోస్ షేక్ -అమ్లా దంపతులు పాల్గొంటున్నారు. వీరి ముగ్గురు మగపిల్లలు ఆ ప్రాంగణంలోనే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో, నిర్మాణం పనుల కోసం ఆ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నీటి తొట్టివద్ద ఆగ్రోస్ షేక్ పిల్లలు సోమవారం ఆడుకుంటుండగా బిలాల్ (2)అనే బాలుడు నీటి తొట్టిలో జారిపడి ఊపిరాడక మృతిచెందాడు. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

విమానాలపై లేజర్ కిరణాలు

అడయార్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): చెన్నై విమానాశ్రయంలో ల్యాండింగ్‌లో అయ్యేందుకు వచ్చిన విమానంపై లేజర్ కిరణాలు ప్రసరించాయి. ఇవి పైలెట్లకు తీవ్ర అసౌకర్యానికి గురిచేశాయి. మంగళవారం వేకువజామున పూణె నుంచి చెన్నైకి 178 మంది ప్రయాణికులతో ఎయిరిండియా విమానం వచ్చింది. ఈ విమానం ల్యాడింగ్ అయ్యే సమయంలో ఎయిర్ పోర్టు పక్కనే ఉన్న సెంట్ థామస్ మౌంట్ ప్రాంతం వైపు నుంచి లేజర్ కిరణాలు విమానంపై ప్రసరించాయి. ఈ కిరణాలను గమనించిన పైలెట్లు వెంటనే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇచ్చి విమానాన్ని సురక్షితంగా ల్యాండింగ్ చేశారు. ఈ లేజర్ కిరణాల కారణంగా ఎయిర్‌పోర్టులో టెన్షన్ వాతావరణం నెలకొంది. గత రెండు వారాల్లో ఇలా జరగడం ఇది మూడోసారి కావడం గమనార్హం. విమానాలపై లేజర్ కిరణాలు ప్రసరించేలా కొందరు సంఘ విద్రోహశక్తుల పనిగా విమానాశ్రయ అధికారులు భావిస్తున్నారు. ఈ విషయంపై ఎయిర్‌పోర్టు ఉన్నతాధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేస్తున్నారు. అలాగే, ఎయిర్‌పోర్టు చుట్టూ 5 కిలోమీటర్ల దూరానికి డ్రోన్లపై నిషేధం ఉన్న విషయం తెల్సిందే.

రవి మోహన్ కొత్త చిత్రం 'బ్రో కోడ్'


కార్తీక్ యోగి, రవి మోహన్

హీరో రవి మోహన్ నిర్మాతగా అవతారమెత్తారు. ఆయన హీరోగా ఓ చిత్రంలో నటించడంతో పాటు ఆ మూవీని సొంతంగా నిర్మించనున్నారు. దీనికి 'బ్రో కోడ్' అనే పేరు ఖరారు చేశారు. కార్తీక్ యోగి దర్శకుడు. తాజాగా హీరో రవి మోహన్ సొంతంగా 'రవి మోహన్' పేరుతో ఓ స్టూడియోను ప్రారంభించిన విషయం తెల్సిందే. ఈ స్టూడియో బ్యానరుపై తొలి చిత్రాన్ని నిర్మించనున్నారు. 'డిక్కిలోనా', 'వడకుపట్టి రామస్వామి' వంటి విజయవంతమైన చిత్రాలకు కార్తీక్ యోగి దర్శకత్వం వహించారు. 'బ్రో కోడ్'లో రవి మోహన్‌తో పాటు ఎస్‌జే సూర్య ఓ ప్రధాన పాత్ర పోషించనున్నారు. ఈ ప్రాజెక్టు గురించి దర్శకుడు కార్తీక్ యోగి మాట్లాడుతూ 'హీరో రవి మోహన్‌కు కథ చెప్పినపుడు ఆయన ఎంతగానో ఎంజాయ్ చేశారు. సొంతంగా నిర్మించేందుకు ముందుకు వచ్చారు. ఇందులో స్లాప్‌స్టిక్ కామెడీ సన్నివేశాలున్నాయి? అభిమానులకు భిన్నమైన సినిమాటిక్ అనుభూతిని కలిగిస్తుంది. కామెడీకి అధిక ప్రాధాన్యతనిస్తూ రూపొందించనున్నాం. రవి మోహన్ సరసన నలుగురు హీరోయిన్లు నటించనున్నారు. ప్రాజెక్టుకు సంబంధించి అన్ని వివరాలతో త్వరలోనే ఒక అధికారిక ప్రకటన చేయనున్నాం' అని పేర్కొన్నారు.

ధనుష్ చిత్రానికి దర్శకుడిగా హెచ్.వినోద్


ధనుష్ - హెచ్.వినోద్

యువ దర్శకుడు హెచ్.వినోద్ తన తదుపరి చిత్రాన్ని హీరో ధనుష్‌తో రూపొందించనున్నట్టు సమాచారం. ప్రస్తుతం అగ్ర హీరో విజయ్‌తో 'జన నాయగన్' అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. షూటింగ్ కూడా చివరి దశకు చేరుకుంది. ఈ సినిమా పూర్తి చేసిన తర్వాత ధనుష్ నటించే చిత్రానికి వినోద్ దర్శకత్వం వహించనున్నారు. సెవెన్ స్క్రీన్ ప్రొడక్షన్ పతాకంపై ఎస్ఎస్ లలిత్ కుమార్ ఈ మూవీ నిర్మించనున్నారు. ధనుష్‌కు ఉన్న కమిట్‌మెంట్ల దృష్ట్యా ఈ కొత్త ప్రాజెక్టు వచ్చే యేడాది వేసవి సెలవుల్లో సెట్స్ పైకి తీసుకెళ్ళాలని భావిస్తున్నారు. కాగా, 'జన నాయగన్' పంపిణీ హక్కులను చిత్రాన్ని నిర్మాత లలిత్ కుమార్ సొంతం చేసుకున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం.

చిత్రజ్యోతి

మెగా ఫోన్ పట్టనున్న కాజల్ అగర్వాల్?



ఒకపుడు చిత్రపరిశ్రమలో ఓ వెలుగు వెలిగిన హీరోయిన్ కాజల్ అగర్వాల్‌కు వివాహం తర్వాత సినిమా అవకాశాలు తగ్గిపోగా, ఓ బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత సినిమా చాన్సులు దాదాపు ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో ఆమె నటించిన హిందీ చిత్రం 'సికిందర్' బాక్సాఫీస్ వద్ద బోల్తాపడింది. ఈ నేపథ్యంలో ఆమె ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, త్వరలోనే ఒక చిత్రానికి దర్శకత్వం వహించనున్నట్టు వెల్లడించారు. దీనిపై మిశ్రమ స్పందనలు వస్తున్నాయి. కాజల్ కంటే సీనియర్ హీరోయిన్లు అయిన ఖుష్బూ, సిమ్రన్, జ్యోతిక వంటివారు దర్శకత్వం వైపు కన్నెత్తి చూడటం లేదు. కానీ, కాజల్ మాత్రం దర్శకత్వం వైపు మొగ్గు చూపుతుండటం పలువురిని విస్మయపరుస్తోంది. అయితే, ఈ అంశంపై కాజల్ సన్నిహితుల వైపు నుంచి ఎలాంటి స్పందన రాలేదు.

రజనీని కలిసిన వనిత, జోవిక

● 4న 'మిసెస్ అండ్ మిస్టర్' రిలీజ్

ప్రముఖ నటి వనిత, ఆమె కుమార్తె జోవికా మంగళవారం సూపర్‌స్టార్ రజనీకాంత్ ఆశీస్సులు తీసుకున్నారు. జోవికా నిర్మాతగా వనిత ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రం 'మిసెస్ అండ్ మిస్టర్' మూవీ తెరకెక్కింది. ఇప్పటికే ఆడియో, ట్రైలర్ రిలీజ్ చేయగా ఆడియన్స్ నుంచి మంచి స్పందన వచ్చింది. ఈ నేపథ్యంలో తన తల్లి దివంగత మంజుల వర్ధంతిని పురస్కరించుకుని సినిమాను వచ్చే నెల 4వ తేదీ విడుదల చేయనున్నట్టు అధికారికంగా వెల్లడించారు. ఈ మేరకు రిలీజ్ తేదీ పోస్టరును సూపర్‌స్టార్ రజనీకాంత్ చేతుల మీదుగా ఆవిష్కరణ చేయించారు. శ్రీకాంత్ దేవా సంగీతం సమకూర్చిన ఈ చిత్రంలో రాబర్ట్ మాస్టర్, శ్రీమాన్, శశికళ, కిరణ్ రాథోడ్, చెఫ్ దాము, పవర్‌స్టార్ శ్రీనివాసన్, రవికాంత్, నాంజిల్ విజయన్ తదితరులు నటించారు.

రిలీజ్ తేదీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రజనీకాంత్ ←



ముగియనున్న నిషేధకాలం

వేటకు గంగపుత్రులు సన్నద్ధం

● 14వ తేదీ అర్ధరాత్రితో గడువు సమాప్తం

● చేపల ధరలు తగ్గే అవకాశం










ప్యారీస్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేపల వేటకు ప్రభుత్వం విధించిన నిషేధం గడువు 14వ తేదీ అర్ధరాత్రితో ముగియనుంది. దాదాపు రెండు నెలలుగా ఉపాధి కోల్పోయిన గంగపుత్రులు నిషేధకాలం గడువు ముగిసే రోజు దగ్గరపడుతుండటంతో మళ్ళీ చేపలవేటకు సన్నద్ధమవుతున్నారు. దీంతో రాష్ట్రంలో చెన్నై నుంచి కన్నియాకుమారి వరకువున్న కోస్తా జిల్లాల్లోని కడలిపుత్రులు వేటకు వినియోగించే సామగ్రిని సిద్ధంచేసుకుంటున్నారు. చేపల సంతానోత్పత్తి దృష్ట్యా ఏప్రిల్ 15 నుండి జూన్ 14వ తేదీ వరకు ప్రభుత్వం సముద్రంలో చేపలవేట నిషేధించింది. దీంతో సుమారు 5,262 ఫిషింగ్ కాలర్స్ 60 రోజుల పాటు తీరం నుంచి కదల్లేదు. ఈ నేపథ్యంలో శనివారం అర్ధరాత్రితో నిషేధకాలం ముగియనుంది. నిషేధకాలంలో రాష్ట్రవ్యాప్తంగా చేపలు, రొయ్యలు, పీతల తదితరాల ధరలు కూడా రెండింతలు పెరిగాయి. నిషేధ సమయంలో కొంతమంది జాలర్లు నాటుపడవల్లో సముద్రంలో పరిమిత దూరం వరకు మాత్రమే వెళ్ళేందుకు అనుమతించడంతో అతి తక్కువ సంఖ్యలోనే చేపలు లభించడంతో ధరలు ఆకాశానంటాయి. ఈ నేపథ్యంలో, వచ్చే ఆదివారం ఉదయం నుంచి చేపల ధరలు తగ్గే అవకాశముందని వ్యాపారులు చెబుతున్నారు.





వేటకు అవసరమైన వలలు, పడవలను సిద్ధంచేసుకుంటున్న మత్స్యకారులు


తీర్థకొలనులో తెప్పపై ఊరేగుతున్న భగవతి అమ్మన్

నేత్రపర్వంగా భగవతి అమ్మన్ తెప్పోత్సవం

చెన్నై, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కన్నియాకుమారి భగవతి అమ్మన్ ఆలయంలో వైకాశి విశాఖ ఉత్సవాలు మే 31న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. రోజూ అమ్మవారికి అభిషేకాలు, అలంకార దీపారాధనలు, మధ్యాహ్నం అన్నదానం, రాత్రి వాహనసేవలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో 9వ రోజైన ఆదివారం ఉదయం రథోత్సవం జరిగింది. పదవ రోజైన సోమవారం ఉదయం అమ్మవారికి త్రివేణి సంగమంలో ఆరాట్టు కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఆరుగంటలకు అమ్మవారు సర్వాలంకరణశోభితురాలై కామధేను వాహనంపై ఊరేగి భక్తులను అనుగ్రహించారు. రాత్రి తీర్థకొలనులో తెప్పోత్సవం వేలాదిమంది భక్తుల సమక్షంలో కనులపండువగా జరిగింది. ఉత్తర రథం వీధివైపు కొలనులో నీరు తగ్గిపోవడంతో స్థానికులు శ్రమదానం చేసి నీటి మట్టాన్ని పెంచడంతో ఈ తెప్పోత్సవం సాఫీగా కొనసాగింది. తీర్థకొలనులో మూడుసార్లు అమ్మవారిని తెప్పలో ఊరేగారు. 14 యేళ్ల విరామం తర్వాత జరిగిన ఈ తెప్పోత్సవాలను తిలకించేందుకు చుట్టుపక్కలి జిల్లాల నుండి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు.

మెరీనా బీచ్‌లో దివ్యాంగులకు ప్రత్యేక వాహనం



పెరంబూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మెరీనా బీచ్‌లో 'బ్లూ ఫ్లాగ్' ప్రాజెక్ట్‌లో భాగంగా పలు చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా దివ్యాంగులకు నాలుగు చక్రాల వాహనాలను గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ఏర్పాటు చేసింది. జీసీసీ ఆధ్వర్యంలో రూ.5.60 కోట్లతో బీచ్ ప్రాంతంలో వాకింగ్ ట్రాక్, సైక్లింగ్ ట్రాక్, వాచ్ టవర్, క్రీడా స్థలం, సీసీ కెమెరాలు, ఓపెన్ జిమ్, పిల్లలకు ప్రత్యేక ఉపకరాణాలతో కూడిన క్రీడా స్థలం తదితరాలు ఏర్పాటవుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఇప్పటికే దివ్యాంగులు సముద్రం సమీపంలోకి వెళ్లేలా ప్రత్యేక మార్గం ఏర్పాటుచేశారు. ప్రస్తుతం దివ్యాంగులు సులభంగా వెళ్లేలా నాలుగు చక్రాలతో కూడిన వాహనాలను కూడా సిద్ధం చేశారు.. వీటిని మెరీనా, బీసెంట్ నగర్ బీచ్‌లలో దివ్యాంగుల ప్రత్యేక మార్గం వద్ద ఉంచినట్లు జీసీసీ కమిషనర్ కుమరగురుబరన్ తెలిపారు.

వైభవంగా కూడలళగర్ పెరుమాళ్ రథోత్సవం

చెన్నై, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మదురై అరుళ్‌మిగు కూడలళగర్ పెరుమాళ్ వైకాశి విశాఖ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మహారథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. అష్టోత్తర శత వైష్ణవదివ్యక్షేత్రాల్లో ఒకటి, ఆళ్వార్లు మంగళాశాసనసమొనర్చిన క్షేత్రంగా పేరొందిన కూడలళగర్ పెరుమాళ్ ఆలయంలో వైకాశి విశాఖ ఉత్సవాలు ఈ నెల 2న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల సందర్భంగా పెరుమాళ్ తాయార్‌ను వివిధ వాహనాల్లో ఊరేగించారు. ఈ నేపథ్యంలో ఉత్సవాల్లో ప్రధానఘట్టమైన రథోత్సవం మంగళవారం ఉదయం ప్రారంభమైంది. టీఎం కోర్టు ప్రాంతంలో అలంకరించిన రథంలోని ప్రత్యేక పీఠంపై శ్రీదేవీ భూదేవీ సమేత అరుళ్‌మిగు సుందరరాజపెరుమాళ్ ఆశీనులయ్యారు. ఆ తర్వాత భక్తులు రథం మోకుతాళ్ళను లాగుతూ వెళ్ళారు. వేలాదిమంది భక్తులు, మంగళవాయిద్యాల నడుమ ఈ రథం దక్షిణ మాఢవీధి, తిరుప్పరంకుండ్రం రోడ్డు, మేల్ మాసి వీధి, నేతాజీ రోడ్డు తదితర వీధుల మీదుగా ఊరేగి చివరకు రథమండప ప్రాంతానికి చేరుకుంది.


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు


'గీతం' వెజ్ రెస్టారెంట్ ప్రారంభోత్సవ దృశ్యం

పోరూర్‌లో 'గీతం' వెజ్ రెస్టారెంట్

అడయార్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూర్‌లో గీతం వెజిటేరియన్ రెస్టారెంట్ 14వ శాఖను తాజాగా ప్రారంభించారు. వివిధ రకాలైన రుచికరమైన వంటలతో ఆహార ప్రియులను అమితంగా ఆకర్షిస్తున్న ఈ రెస్టారెంట్‌కు నగరంలోని పలు ప్రాంతాల్లో శాఖలున్నాయి. ఈ నేపథ్యంలో తమ 14వ శాఖను పోరూర్‌లో ఏర్పాటుచేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటి నళిని నాయర్, చెన్నై హోటల్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు రామదాస్ రావు, గీతం వెజ్ రెస్టారెండ్ వ్యవస్థాపకుడు మురళితో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. కాగా, రెస్టారెంట్‌ను ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి అర్ధరాత్రి 2 గంటల వరకు ఉంటుంది. ఇందులో దాదాపు 600 రకాలైన వంటకాలు అందుబాటులో ఉంటాయి.

మెట్రో రైల్వే స్టేషన్‌లో చెన్నై బుక్‌పార్క్

● ప్రారంభించిన సీఎం స్టాలిన్

చెన్నై, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో సెంట్రల్ మెట్రో రైల్వేస్టేషన్‌లో రూ.1.85 కోట్లతో 'చెన్నై బుక్‌పార్క్'ను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. ఆ సమయంలోనే గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో రూ.29.80 కోట్లతో 110 అదనపు గ్రంథాలయ భవనాలు, పరమక్కుడిలో గ్రంథాలయ భవనాన్ని కూడా ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ప్రభుత్వ పాఠ్యపుస్తకాల సంస్థ ప్రచురించిన 84గ్రంథాలను కూడా ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ చెన్నై సెంట్రల్ మెట్రో రైల్వేస్టేషన్‌లో ఏర్పాటైన బుక్ పార్క్ అంతర్జాతీయ స్థాయి గ్రంథాలయాన్ని తలపించేలా నిర్మించామని, తమిళం, ఆంగ్లం సహా పలు భాషల పుస్తకాలు, రాష్ట్రపాఠ్య పుస్తకాల సంస్థ ముద్రించే పుస్తకాలు, సాహిత్య అనువాద గ్రంథాలు, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు, బాల సాహిత్యం ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వీకే శేఖర్‌బాబు, అన్బిల్ మహేష్, జీసీసీ మేయర్ ఆర్ ప్రియ, శాసనసభ్యుడు ఇ.పరంధామన్, రాష్ట్ర పాఠ్యపుస్తకాల సంస్థ ఛైర్మన్ ఐ. లియోనీ, చెన్నై మెట్రోరైల్వేసంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎంఏ సిద్ధిక్, పాఠశాలల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి చంద్రమోహన్, వివిధ ప్రచురణ సంస్థల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.


చెన్నై బుక్ పార్క్ ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి


ఆంధ్రకళా స్రవంతి అధ్యక్షులు జేఎం నాయుడు-అన్నపూర్ణమ్మ దంపతుల మనవడు డాక్టర్ వీఎస్ఎస్ చరణ్-డాక్టర్ జి.నివేదల వివాహ రిసెప్షన్ సోమవారం రాత్రి చెన్నై, వానగరంలో జరిగింది. ఇందులో ఆర్‌ఎంకే విద్యాసంస్థల ఛైర్మన్ ఆర్.ఎస్.మునిరత్నం, గోపురం కుంకుమ సంస్థ అధినేత లయన్ వైవీ హరికృష్ణ, వేలమ్మాళ్ విద్యాసంస్థ తరుపున శశికుమార్, వేల్ మోహన్, తెలుగు ప్రముఖులు ఎం.ఆదిశేషయ్య, బీఎల్.కుమరవేల్, కె.అనిల్‌కుమార్‌రెడ్డి, చారుగుండ్ల వెంకటేశ్వరరావు, ఎంవీ నారాయణగుప్తా, బంధుమిత్రులు, కుటుంబసభ్యులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.



కడసారి కష్టాలు

కేవీబీపురం మండలం వగత్తూరు గ్రామంలో మరణించిన వారిని కాటికి తీసుకెళ్లడానికి కడసారి కష్టాలు తప్పడం లేదు. గ్రామం ఏర్పడి 70 సంవత్సరాలవుతున్నా ఇప్పటికీ శ్మశానానికి దారి లేక గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. పొలాల మీదుగా పాడె మోసుకెళ్లే దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా కార్యాలయాలు చుట్టూ తిరిగినా శ్మశానానికి దారి ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యే స్పందించి తమ శ్మశానానికి దారి ఏర్పాటు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- కేవీబీపురం, ఆంధ్రజ్యోతి

తిరుమల అడవుల్లో అగ్నిప్రమాదం

తిరుమల శేషాచల అడవుల్లో మంగళవారం అగ్నిప్రమాదం జరిగింది. శ్రీవారిపాదాల మార్గంలోని అడవిలో ఒక్క సారిగా మంటలు చెలరేగాయి. ఈక్రమంలో వాహనదారులు, భక్తులు గమనించి వెంటనే ఫారెస్ట్, ఫైర్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. రెండు ఫైర్ ఇంజిన్లలో మంటలను అదుపు చేశారు. . స్వల్పంగా మంటలు చెలరేగాయని, సకాలంలో అధికారులు, సిబ్బంది స్పందించడంతో ఎలాంటి నష్టం వాటిల్లలేదని టీటీడీ పేర్కొంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ ఏటీసీ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.90 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 84,258

తలనీలాలు సమర్పించినవారు: 33,502



‘కింగ్‌డమ్’ను ఆదరించండి

- సినీనిర్మాత నాగవంశీ -



తిరుమల, జూన్10 (ఆంధ్రజ్యోతి): విజయ్ దేవరకొండ ‘కింగ్‌డమ్’ చిత్రం జూలై నెలలో విడుదలకు సిద్ధంగా ఉందని, తప్పకుండా అందరు చూసి ఆదరించాలని కోరుకుంటున్నానని ఈ చిత్ర నిర్మాత నాగవంశీ తెలిపారు. రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కలిసి ఆయన మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు నాగవంశీ మీడియాతో మాట్లాడుతూ.. సోమవారం తనవి రెండు చిత్రాల షూటింగ్ మొదలైందన్నారు. ఈసందర్భంగా శ్రీవారి ఆశీస్సుల కోసం వచ్చినట్టు వెల్లడించారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు



కోన రవికుమార్, సభ్యులు

తిరుమల, జూన్10(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ శాసనసభ పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్ కమిటీ చైర్మన్ కోనా రవికుమార్, సభ్యులు, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస హరీశ్‌కుమార్, ఎమ్మెల్యేలు వసంత కృష్ణప్రసాద్, వర్ల కుమార్‌రాజ, తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.



జస్టిస్ శ్రీనివాస హరీశ్‌కుమార్

ఎస్వీయూ యూజీ 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాల విడుదల

తిరుపతి(విద్య), జూన్ 10(ఆంధ్రజ్యోతి): శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీ పరిధిలో 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేసినట్టు వర్శిటీ డీన్ ఆచార్య కొంగర సురేంద్రబాబు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో యూజీ సప్లిమెంటరీ 6వ సెమిస్టర్ పరీక్షలు జరిగాయని, వాటికి సంబంధించిన ఫలితాలను ఆన్‌లైన్‌లో ఉంచినట్టు ఆయన వెల్లడించారు.విద్యార్థులు results.manabadi.co.in లింక్ ద్వారా ఫలితాలను చూడవచ్చని తెలియజేశారు.

తిరుపతి కార్పొరేషన్ పరిధి పెరగాలి

- 53వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పూర్తిచేస్తాం
- శాసనసభ పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ చైర్మన్ రవికుమార్



తిరుపతి, జూన్10(ఆంధ్రజ్యోతి): ‘తిరుపతి కార్పొరేషన్ పరిధి పెంచాల్సిన అవసరముంది. అందుకు ప్రభుత్వం చర్యలు తీసుకునేలా చర్యలు చేపడతాం’ అని శాసనసభ పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. మంగళవారం సాయంత్రం తిరుపతిలోని శ్రీ పద్మావతి సమావేశ మందిరంలో ఏపీ ఎస్పీడీసీఎల్, తిరుపతి స్మార్ట్ సిటీ, టూరిజం, టీటీడీ విభాగాలపై ఆయన సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ విభాగాలపై త్వరలో లోతుగా చర్చించి, అన్ని నివేదికలను స్పీకర్ ముందుంచి లోటుపాట్లను సవరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాబోయే మూడు నెలల్లో కొత్తగా 53 వేల వ్యవసాయ సర్వీసులు పూర్తి చేస్తామన్నారు. మరికొన్ని 33/11 కేవీ సబ్ స్టేషన్లను గడువులోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. స్మార్ట్ సిటీకి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన గడువు మార్చికి ముగిసిందని, పనులన్నీ త్వరలో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో రాష్ట్ర ప్రభుత్వ వాటా 50 శాతం కూడా విడుదల చేయలేదని, కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన 2ఆర్థిక సంవత్సర నిధులు పెండింగ్‌లో పెట్టడంతో పనులు నిలిచాయన్నారు. పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం చాలా వరకు భూములు కేటాయించిందని, ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న ప్రాజెక్టులను వినియోగంలోకి తెచ్చి ఆదాయ మార్గాలను వెతకాలని సూచించారు. రాష్ట్రంలో 16 ఏళ్ల తర్వాత పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ తొలిసారిగా పనిచేయడం ప్రారంభించిందన్నారు. ఇది స్టాట్యూటరీ కమిటీ అని, సభ్యులందరూ అందరికీ సుపరిచితులేనని అన్నారు. పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీల్లో 186 కంపెనీలు ఉన్నాయని వివరించారు. ఈ కమిటీ తాలూకు విధివిధానాలను పరిశీలిస్తే అన్ని కంపెనీలకు సంబంధించి రివ్యూ చేయొచ్చన్నారు. కంపెనీ పర్ఫామెన్స్, ఆడిట్ రిపోర్ట్, ఎఫిషియన్సీ, కంపెనీ చట్టం ప్రకారం ఏర్పడినటువంటి కంపెనీలు, సొసైటీ చట్టం ప్రకారం ఏర్పడిన కార్పొరేషన్లకు సంబంధించిన ప్రతి కంపెనీ వార్షిక నివేదికలు అసెంబ్లీలో పొందుపరచాలన్నారు.

వెనామీకి వైట్ పీకల్





వైట్ పీకల్‌తో చనిపోయి ఉన్న రొయ్యలు - కోట మండలం కొత్తపట్నంలో వైట్ పీకల్ సోకిన రొయ్యలను విక్రయానికి సిద్ధం చేస్తున్న రైతులు

- లక్షల్లో చనిపోతున్న రొయ్య పిల్లలు
- ఆక్వా రైతులను నిలువునా ముంచుతున్న వాతావరణ మార్పు

కోట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పు, ఉష్ణోగ్రతలో తేడా ఆక్వా రైతులను నిలువునా ముంచుతోంది. వెనామీ రొయ్యలకు వైట్ పీకల్ (తెల్లపారుడు) వ్యాధి సోకి లక్షల్లో పిల్లలు చనిపోతుండడంతో రైతులు లబోదిబో మంటున్నారు. సముద్రతీర ప్రాంతమైన కోట మండలంలో ప్రధానంగా వెనామీ రొయ్యలు సాగును చేస్తున్నారు. కొత్తపట్నం, శ్రీనివాససత్రం, వావిళ్ల దొరువు, గోవిందపల్లి, దొరువుకట్ట ప్రాంతాల్లో రొయ్యలకు వైట్ పీకల్ వ్యాధి సోకి పిల్లలు చనిపోతున్నాయి. ఇదే అదునుగా బయ్యర్లు అడిగిన రేటుకు రొయ్యలను విక్రయించాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● వైట్ పీకల్ లక్షణాలు

వెనామీ రొయ్య పిల్లలు 25నుంచి 30 డిగ్రీల ఉష్ణోగ్రతను తట్టుకోగలుగుతాయి. అయితే రెండు రోజులు ముందు 40నుంచి 50 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవడం, ప్రస్తుతం వాతావరణం చల్లబడడంతో వైట్ పీకల్ వ్యాధి సోకింది. దీంతో రొయ్యలు మేత తినకుండా రోజురోజుకు బలహీన పడి ఎదుగుదల ఆగిపోతోంది. ఊపిరాడక గుంటల వ్యవధిలోనే చనిపోతున్నాయి. సాధారణంగా వెనామీ రొయ్యలకు మూడు నుంచి పది గ్రాముల బరువు వరకు వైట్ పీకల్ సోకుతుంది. ప్రస్తుతం పది గ్రాముల సైజులో కూడా వైట్ పీకల్ సోకుతుండడంతో రైతులు లబోదిబో మంటున్నారు.



బాలకృష్ణ పుట్టినరోజున తిరుమలలో 650 టెంకాయల సమర్పణ

తిరుమల, జూన్10(ఆంధ్రజ్యోతి): నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం టీడీపీ నాయకులు తిరుమల శ్రీవారికి 650 కొబ్బరికాయలు సమర్పించారు. పార్టీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ ఆధ్వర్యంలో ఉదయం అఖిలాండం వదఆరున్నర కిలోల కర్పూరం వెలగించి, 650 కొబ్బరికాయలు సమర్పించారు. నందమూరి బాలకృష్ణ ఆరోగ్యంగా ఉండాలని, ప్రజలకు ఇంకా మెరుగైన సేవలు అందించాలని శ్రీవారిని కోరుకుంటూ కొబ్బరికాయలు సమర్పించామని శ్రీధరవర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో రూపేష్ వర్మ, సుబ్బు పాల్గొన్నారు.

అఖిలాండం వద్ద కొబ్బరికాయలు కొడుతున్న శ్రీధర్‌వర్మ, నేతలు

కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై అభయ హస్తాధీశుడి కటాక్షం

వడమాలపేట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వరాలయ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం స్వామివారు దేవేరులతో కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై అభయ హస్తాధీశుడిగా ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివార్లను మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ఉదయం స్వామివారు స్వర్ణభరణాలతో సర్వాలంకార భూషితుడిగా పద్మావతీ, ఆండాల్ సమేతంగా రాజమన్నార్ అలంకారంలో మాడవీధుల్లో ఊరేగారు. అనంతరం ఉభయ నాంచారులతో ప్రసన్న వేంకటేశ్వరుడికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి సర్వాభూపాలురలను వాహనంగా చేసుకొన్న ప్రసన్న వేంకటేశ్వరుడు ప్రసన్నవదనంతో మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకుల వేదమంత్రాలతో మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు.





కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై దేవేరులతోకలిసి ఊరేగుతున్న శ్రీనివాసుడు

కమనీయంగా కమలానాథుడి కల్యాణోత్సవం

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉభయ దేవేరులతో కమలానాథుడి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. మంగళవారం సాయంత్రం పద్మావతీ, ఆండాల్ సమేత ప్రసన్న వేంకటేశ్వరుడిని పట్టు పీతాంబరాలతో వధూవరులుగా కల్యాణం పీటంపై అధిరోహింప జేశారు. ఆలయ ప్రధాన అర్చకులు



సూర్యకుమారాచార్యులు, తిప్పయ్యాచార్యులు ఆధ్వర్యంలో వేదమంత్రాలు, భక్తుల గోవిందనామ స్మరణల నడుమ శాస్త్రోక్తంగా ప్రసన్న వేంకటేశ్వరుడిచే ఉభయ నాంచారులకు మాంగళ్య ధారణ చేయించారు. పరిసరాలనుంచి భక్తులు విశేషంగా తరలి వచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించి తన్మయత్వం చెందారు.

నేడు శ్రీవారి గరుడసేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 11న బుధవారం రాత్రి 7.00-8.30 గంటల మధ్య గరుడోత్సవం నిర్వహించనున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా వాహనాల రాకపోకల నియంత్రణ కోసం ఆలయం అధికారులు తగు ఏర్పాట్లు చేస్తున్నారు.

సీబీఐ అధికారి పేరిట బెదిరింపులు

- సైబర్ నేరస్తుల ఉచ్చులో పడి రూ.1.20 కోట్లు పోగొట్టుకున్న రిటైర్డు టీచర్

తిరుపతి(నేరవిభాగం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సీబీఐ అధికారినంటూ తిరుపతికి చెందిన రిటైర్డు టీచర్‌ను భయపెట్టి.. ఆమె నుంచి రూ.1.20 కోట్లను ఆన్‌లైన్ ద్వారా లాగేసుకున్న ఘటన అలిపిరి పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు.. నవోదయ కాలనీలో నివాసమున్న రిటైర్డు టీచర్‌కు ఏప్రిల్ 16 నుంచి గత నెల 20వ తేది వరకు గుర్తు తెలియని వ్యక్తి నుంచి పలు దఫాలుగా ఫోన్ కాల్స్ వచ్చాయి. తాను సీబీఐ అధికారినంటూ ఆ వ్యక్తి పరిచయం చేసుకున్నాడు. మీ ఆధార్ నెంబరు ఢిల్లీలోని కెనరా బ్యాంకులో మోసపూరితంగా ఉపయోగించి సదాఖత్ ఖాన్ అనే వ్యక్తి మానవ అక్రమ రవాణా చేస్తూ అకౌంటును వాడుతున్నాడని బెదిరించాడు. అనంతరం వీడియో కాల్ చేసి.. వెంటనే మీబ్యాంకు ఖాతాల సమాచారం ఇవ్వాలని, లేదంటే కేంద్ర దర్యాప్తు సంస్థలకు తెలియచేస్తామని భయపెట్టాడు. దీంతో ఆమె తనకున్న వివిధ బ్యాంకు ఖాతాల నుంచి ఆరు విడతలుగా దాదాపు రూ.1.20 కోట్లు సైబర్ నేరగాళ్ల అకౌంటుకు మార్చారు. దీనిపై తాను మోసపోయానని గుర్తించి ముందుగా సైబర్ సెల్ నెంబరు 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. మంగళవారం ఆమె అలిపిరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీఐ రాంకిషోర్ కేసు నమోదు చేశారు.

ఐసర్ రసాయన శాస్త్ర ప్రయోగశాలలో అగ్నిప్రమాదం

- భయాందోళన చెందిన విద్యార్థులు, కార్మికులు
- తక్షణ చర్యలతో ఊపిరి పీల్చుకున్న విద్యార్థులు

ఏర్పేడు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంలోని జంగాలపల్లి వద్ద ఉన్న కేంద్రియ విద్యా సంస్థ ఐసర్ (ఇన్‌స్టిట్యూట్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్)లోని రసాయనిక శాస్త్ర ప్రయోగశాలలో మంగళవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం జరిగింది. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రయోగశాలలోని ఒక రెఫ్రిజిరేటర్, కొన్ని వినియోగ పదార్థాల డబ్బాల నుంచి మంటలు వెలువడ్డాయి. దీంతో ప్రయోగశాల నుంచి పొగలు అలుముకున్నాయి. ప్రమాదాన్ని గమనించిన విద్యార్థులు, ఉద్యోగులు భయాందోళనతో బయటకు పరుగులు తీశారు. అధికారులు తక్షణమే స్పందించి భద్రతా చర్యలు చేపట్టారు. శ్రీకాళహస్తి, వెంకటగిరి అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. పరికరాల నష్టం అంచనా వేయాల్సి ఉంది. ప్రాథమిక సమాచారం ప్రకారం అగ్నిప్రమాదం ప్రయోగశాలలో ఉన్న రిఫ్రిజిరేటర్, కొన్ని వినియోగ పదార్థాల వరకే పరిమితమైంది. ఐసర్ ప్రాంగణంలో ఉన్న అగ్ని ప్రమాద నివారణ సదుపాయాలతో కేవలం ప్రయోగశాలకు మాత్రమే మంటలు పరిమితమైనట్లు తెలుస్తోంది.



ఐసర్‌లోని రసాయనిక శాస్త్ర ప్రయోగశాలలో బయటకు వస్తున్న పొగ

ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ ఏర్పాటు

ఈ అగ్నిప్రమాదానికి సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టడానికి సంస్థ స్వతంత్ర సత్య నిర్ధారణ కమిటీని(ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ) ఏర్పాటు చేయనున్నట్లు ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య తెలిపారు. ఈ కమిటీ విచారణ జరిపి నివేదిక అందించనుంది.

వేరుశనగ విత్తనాల పంపిణీని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జూన్ 10(ఆంధ్రజ్యోతి): వేరుశెనగ విత్తనాల పంపిణీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వేరుశెనగ విత్తనాలను విస్తారంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు, పాకాల, చంద్రగిరి, రామచంద్రాపురం, తిరుపతి రూరల్‌లో 40 శాతం సబ్సిడీతో విత్తనాలను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఆధార్‌కార్డుతో విత్తనాలను తీసుకోవాలని సూచించారు.

టీటీడీ ఉద్యోగుల ఇళ్లస్థలాలకు అనుమతులపై కమిటీ

- అధికారులను ఆదేశించిన ఈవో శ్యామలరావు



తిరుమల, జూన్10(ఆంధ్రజ్యోతి): టిటిడి ఉద్యోగులకు కేటాయించిన ఇళ్ల స్థలాలపై వివిధ శాఖల అనుమతుల విషయంలో సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు సూచించారు.టీటీడీలోని వివిధ శాఖల ఉన్నతాధికారులతో తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ.. ఆయా ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు, ఇతర ఇంజినీరింగ్, మౌళిక సదుపాయాలపై టీటీడీ ఉన్నతాధికారులు చర్చించాలన్నారు. దిగువస్థాయిలో సమస్యలపై సీనియర్ అధికారులు చర్చించి పరిష్కరించాలని, ప్రభుత్వం స్థాయిలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. జీఎన్సీ, ఎస్వీ పూర్‌హోం, కేటీ, వినాయకనగర్, రామనగర్ ప్రాంతాల్లోని టీటీడీ క్వార్టర్స్‌లో డ్రైనేజీ సమస్యలు, భవనాల లీకేజీలు, విద్యుత్ తదతర సమస్యలను తక్షణం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ, డీఎల్వో వరప్రసాద్‌రావు, డిప్యూటీఈవోలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

శాప్ బోర్డులో క్రీడాకారిణి రజనికి స్థానం



తిరుపతి(క్రీడలు), జూన్ 10(ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్(శాప్) బోర్డులో హాకీ క్రీడాకారిణి రజనికి చోటు లభించింది. మంగళవారం ప్రభుత్వం శాప్ బోర్డు సభ్యులను ప్రకటించింది. ఇందులో ఎర్రావారిపాళెం మండలం ఎనుములవారిపల్లెకు చెందిన రజనీకి అవకాశం కల్పించింది. ఈమె హాకీలో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ ప్రదర్శించింది. గతేడాది ఎఫ్ఐహెచ్-5 ఎస్ వరల్డ్‌కప్‌లో సిల్వర్‌మెడల్, 2022 కామన్వెల్త్‌గేమ్స్, ఏసియాకప్‌లో బ్రాంజ్ మెడల్స్, టోక్యో ఒలంపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించింది. 2020లో జరిగిన టోక్యో ఒలంపిక్స్ ప్రాతినిథ్యం వహించింది. గడిచిన 15ఏళ్లుగా హాకీలో రాణిస్తూ జిల్లా, రాష్ట్రంతో పాటు దేశానికి పేరుతెచ్చింది. ఆమె సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మక శాప్ బోర్డులో స్థానం కల్పించింది. ఈ సందర్భంగా రజనిని పలువురు క్రీడా ప్రముఖులు అభినందించారు.

వీఆర్‌కు వెంకటగిరి ఎస్ఐ

వెంకటగిరి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఎస్ఐ సుబ్బారావును వీఆర్‌కు పంపుతూ జిల్లా ఎస్పీ హర్షవర్దన్ రాజు ఉత్తర్వులు మంగళవారం జారీ చేశారు. ఎస్ఐ సుబ్బారావు ఓ న్యాయవాది పట్ల దురుసుగా వ్యవహరించడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఎస్ఐని వీఆర్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

ముగిసిన గోవిందుడి బ్రహ్మోత్సవాలు



తిరుపతి అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): గోవిందరాజ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం రాత్రి జరిగిన చివరి ఘట్టంతో ముగిశాయి. ఉదయం పల్లకిపై స్వామి మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. అనంతరం కపిలతీర్థంలోని ఆళ్వార్ తీర్థానికి ఊరేగింపుగా చేరుకున్నారు. అక్కడ స్నపన తిరుమంజనం నిర్వహించారు. పుష్కరిణిలో కనుల పండువగా చక్రస్నానంనిర్వహించారు. తర్వాత పరిపాలన భవనం ఎదుట పీఆర్ తోటకు వేంచేశారు. సాయంత్రం వరకు అక్కడే ఉండి ఊరేగింపుగా ఆలయం చేరుకున్నారు. రాత్రి శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం నిర్వహించడంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి



